క్లుప్తంగా

రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ మార్పు

సీతంపేట : సీతమ్మధార మండలంలో గతంలో ప్రకటించిన రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను సవరించినట్లు తహసీల్దార్ ఎం.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పెదవాల్తేర్, చినవాల్తేర్, వెంకోజీపాలెం ప్రాంతాల్లో నిర్వహించే సదస్సుల తేదీలు, వేదికల వివరాలు త్వరలో తెలియజేస్తామన్నారు. ఈ నెల 18న దొండపర్తి ప్రాంత ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానాలో, 20న అదే షాదీఖానాలో అల్లిపురం ప్రాంత వాసులకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, మార్పులను ప్రజలు గమనించాలని కోరారు.

10 నుంచి మెగా క్రికెట్ టోర్నీ



టోర్నీ లోగో ఆవిష్కరిస్తున్న రమేష్‌బాబు, గంట్ల శ్రీనుబాబు, తదితరులు

సీతంపేట : హార్ట్ ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 12 వరకు బీహెచ్‌పీవీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెగా క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాము, రవిశంకర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన టోర్నీ లోగోను బీవీకే కళాశాల సమీపంలోని ప్రైవేటు కార్యాలయంలో జబర్దస్త్ నటుడు చదలవాడ రమేష్‌బాబు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి క్రీడా పోటీల వల్ల ఐక్యత, స్నేహభావం, క్రీడాస్ఫూర్తి మరింత పెరుగుతుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు నానిబాబు, పసుపులేటి శ్రీనివాసు, ఆనంద్ సుబేదార్, కృష్ణారెడ్డి, కృపానంద పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ దారుణం



పోర్టు హాస్పిటల్ ఎదురుగా శిబిరంలో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం పోర్టుకు సంవత్సరానికి కోట్లాది రూపాయలు లాభాలు వస్తుంటే పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 68వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఈ ఏడాది పోర్టుకు రూ.725 కోట్లు లాభాలు వచ్చాయని, గత సంవత్సరం రూ.386 కోట్లు లాభం వచ్చిందని తెలిపారు. లాభాలు రావడంలో కార్మికుల శ్రమ కీలకమని తెలిపారు. పోర్టు నుంచి జీవీఎంసీకి సంవత్సరానికి సగటున రూ.65 కోట్లు పన్నుల రూపంలో కడుతున్నారని, ఆ డబ్బులతో నగరంలోని రోడ్లు, కాలువలు అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. విశాఖపట్నం నగరాభివృద్ధికి ఉపయోగపడే పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించడం దారుణమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, పోర్టు నిధులతోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయం కొనసాగించే పక్షంలో కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల మద్దతుతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, లక్ష్మణ్, సీహెచ్ త్రినాథరావు, నాయుడు, సుబ్బారావు, రాజగోపాల్, యల్లారావు, రాఘవులు, పైడిరాజు, తదితరులు పాల్గన్నారు.

ప్రణాళికతో శ్రమిస్తే యువతకు ఉద్యోగాలు



గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

సీతంపేట : ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలన్నది చాలా మంది యువత కల అని, దానిని సాధించేందుకు పక్కా ప్రణాళిక, దృఢ సంకల్పంతో శ్రమించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'కమింగ్ టుగెదర్ ఫర్ డిసిమినేషన్ ఆఫ్ నాలెడ్జ్' అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. లక్ష్యం కంటే ఆరోగ్యం ముఖ్యమని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు స్వీయ శిక్షణలో అన్ని ప్రయత్నాలు చేయాలన్నారు. చదువుకుంటూనే కుటుంబానికి ఆసరాగా నిలవాలని సూచించారు. నా జీవితంలో నేను చూసిన అత్యుత్తమ లైబ్రరీ ఇదేనని కితాబిచ్చారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో ముచ్చటించి, వారికి సలహాలు ఇచ్చారు. గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, ఉపాధ్యక్షుడు టి.ఎస్.ఆర్.ప్రసాద్, ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని సీతమ్మధార దరి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కి చెందిన పూడిపెద్ది వెంకటరమణశాస్త్రి రూ.1,01,116 విరాళాన్ని శనివారం అందజేశారు. దేవస్థానం తరఫున పీఆర్‌వో కార్యాలయంలో దాతకు సూపరింటెండెంట్ విక్రమ్, ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్‌ను అందజేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న అప్పారావు

కంచరపాలెం : అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. కంచరపాలెం పరిధి ఊర్వశి కూడలి దళిత సేన కార్యాలయంలో శనివారం రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ చూపించిన మార్గం అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ గొల్లమాల మీన, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, సీహెచ్ మల్లికార్జునరావు, పట్నాల ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుపై దాడి జరిగిన ప్రాంతం పరిశీలన



ఐటీఐ జంక్షన్ వద్ద పరిశీలిస్తున్న ఫోరెన్సిక్ బృంద సభ్యులు

మర్రిపాలెం : గత నెల 29న కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి ఐటీఐ జంక్షన్ బీఆర్‌టీఎస్ రహదారిలో ఆర్టీసీ బస్సుపై ద్రావకంతో దాడి చేసిన ప్రాంతాన్ని అమరావతి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్)కి చెందిన ఆరుగురు సభ్యుల బృందం శనివారం పరిశీలించింది. బస్సు ఎటు వెపు నుంచి వచ్చింది.., దాడి ఎక్కడ జరిగిందనే వివరాలు సేకరించారు. ఇప్పటికే ద్రావకం నమూనాలను సేకరించి ల్యాబ్‌లో పరిశీలిస్తున్నారు. వారి వెంట డీసీపీ – 2 మేరీ ప్రశాంతి, సీఐ చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

వాకర్స్ క్లబ్ ఎన్నికలు నేడు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి నిమ్మగడ్డ బుచ్చయ్య చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. మధ్యాహ్నం ఓట్లు లెక్కించి, విజేతల వివరాలు సాయంత్రం ప్రకటిస్తామని బుచ్చయ్య చెప్పారు. 877 మంది క్లబ్ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అధ్యక్షుడు, బోర్డు డైరెక్టర్ల పోస్టులకు పోటీ నెలకొంది. అధ్యక్ష పదవికి రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సబ్బినేని రామ్మోహనరావు, మానవసేవే మాధవసేవ గౌరవాధ్యక్షుడు సనపల భానుప్రకాష్ బరిలో నిలిచారు. 9 బోర్డ్ డైరెక్టర్ల పోస్టులకు 12 మంది పోటీలో ఉన్నారు. ఇప్పటికే ఉపాధ్యక్షురాలిగా గొల్జాన విజయలక్ష్మి, కార్యదర్శిగా చొల్లంగి సత్య సూర్య ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శిగా నానుపాత్రుని ప్రకాశరావు, కోశాధికారిగా రోణంకి నాగేశ్వరరావు, జాలీ వాకర్‌గా నానుపాత్రుని మాధవి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో బాలభోగం సమర్పణ, అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పిల్లలను తల్లిదండ్రులు పర్యవేక్షిస్తుండాలి

మెగా పీటీఎంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



మధురానగర్ స్కూల్‌లో పీటీఎంలో తల్లిదండ్రులు, అతిథులు, ఉపాధ్యాయిలు



ఎస్ఎంసీ హైస్కూల్‌లో ఎంపీ శ్రీభరత్, సిబ్బంది

సీతంపేట : పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారని... అదే సమయంలో పిల్లలు ఏం చేస్తున్నారో, ఎలా ప్రవర్తిస్తున్నారో ఎప్పటికప్పుడు కన్నవారు పర్యవేక్షిస్తుండాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సూచించారు. జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో మెగా పీటీఎం హెచ్ఎం బి.లక్ష్మీనరస ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పేరెంట్స్‌కు ముగ్గుల పోటీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌సీసీ కేడెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, ఎం.డి.నజీర్, ముక్కా కిషోర్, వంగల అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ హైస్కూల్‌లో మెగా పీటీఎం ఉత్సాహంగా సాగింది. వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. హెచ్ఎంలు డి.శాంతికుమారి, బి.దేముడుబాబు పర్యవేక్షణలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ద్వారకా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- సీతమ్మధార ఎస్ఎంసీహెచ్‌లో మెగా పీటీఎంకు విశాఖ ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీతమ్మధార తహసీల్దార్ ఎం.రమేష్, ఎంఈవో రామారావు, బర్ల పద్మలత, గొంప ధర్మారావు, అడబాల నాని, రాంప్రసాద్ పాల్గొన్నారు.

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ కప్పరాడ పాఠశాలలో శనివారం మెగా పేరెంట్ మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, డీసీపీ విజయప్రశాంతి, డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ పాల్గొని వేడుకలు ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, గోపాలపట్నం ఎంఈవో దివాకర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కుట్టా కార్తీక్, సీఆర్‌పీలు పద్మ, లంక చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారంతో లక్ష్యాల సాధన

మురళీనగర్ : పాఠశాల విద్యలో ఉన్నత లక్ష్యాల సాధనకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పిల్లల చదువుకు సంబంధించిన ప్రగతిని తెలుసుకోవడంతోపాటు పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి అవసరమైన సలహాలు, సూచనలు తల్లిదండ్రుల నుంచి స్వీకరించేందుకు సమావేశాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇష్టమైన రంగంలో రాణించేందుకు విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ పాఠశాల విద్యలో వినూత్న మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పదో తరగతిలో వంద శాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హోలిస్టిక్ ప్రగతి కార్డులు అందించారు. మహిళలకు రంగోలి, విద్యార్థుల తండ్రులకు టగ్ ఆఫ్ వార్ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కలింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల వరప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ క్రిస్టినా, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, జనసేన నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు, బీజేపీ వార్డు అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, హెచ్ఎం బి.హేమలత పాల్గొన్నారు.

- అల్లూరి సీతారామరాజు కాలనీలోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన పేరెంట్ టీచర్స్ సమావేశంలో బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక పాల్గొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రగతి కార్డులను ఆమె అందించారు. ఎస్ఎంసీ చైర్‌పర్సన్ అరుణ పాల్గొన్నారు. మాధవధార ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం పెద్దినాయుడు ఆధ్వర్యంలో పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ గోపాల కృష్ణ, పూర్వ విద్యార్థి వసంత కుమారి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి వైభవంగా పూజలు



సీతంపేటలో పలని మహారాజా అలంకారంలో సుబ్రహ్మణ్యస్వామి



కల్యాణంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి



సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



ధ్యాన మందిరం ప్రాంగణంలో పూజ చేస్తున్న భక్తులు

సీతంపేట : బాల సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు ఉత్తర నియోజకవర్గంలోని ఆలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో బాల మురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో 108 క్షీర కలశాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా జరిపారు. సాయంత్రం 108 దీప కలశాలతో ప్రత్యేక రథంపై స్వామి ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా స్వామి వారు పలని మహారాజా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

- శ్రీగౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో పుట్ట బంగారమ్మ ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భార్గవ శర్మ స్వామికి విశేష పంచామృతాభిషేకాలు, సుబ్రహ్మణ్య హోమం జరిపారు. అనంతరం 108 కలశాలతో స్వామి వారి తిరువీధి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో స్వామికి జల, క్షీరాభిషేకాలు చేశారు.
- అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య జరిపిన స్వామి కల్యాణం తిలకించిన భక్తులు పరవశించిపోయారు. ఉదయం పీఠంలో సుబ్రహ్మణ్య పాశుపత అభిషేకం, సర్ప శూక్త సహిత పాశుపత హోమం నిర్వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ధ్యాన మందిరంలో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం ప్రాంగణంలోని రావి చెట్టు కింద ఉన్న నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం వద్ద షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వహస్తాలతో పంచామృతాభిషేకాలు, విశేషాభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కంచరపాలెం : స్థానిక ఊర్వశి కూడలి రవీంద్రనగర్‌లో సుబ్రహ్మణ్యస్వామి శరవణ్ ట్రస్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో శనివారం కలశ స్థాపన, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వల్లీ దేవసేన సమేత స్వామికి కల్యాణం, అనంతరం ఊయల సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సీహెచ్ కుమారి, సీహెచ్ పవన్‌కుమార్, కె.రాము, కుప్పల రవి, శ్రీను స్వామి పాల్గొన్నారు.